క్లుప్తంగా

22 నుంచి బ్యాడ్మింటన్ టోర్నీ

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 17వ, ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్–2023ను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ కరెడ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు దేవిడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పురుషుల డబుల్స్‌లో 19 ప్లస్, 35 ప్లస్, 45 ప్లస్ ఏజ్ గ్రూప్ బాడ్మింటన్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మూసారంబాగ్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీలోని జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్స్‌లో ఈ నెల 22 నుంచి 25 వరకు ఉదయం 5.30 నుంచి 9 గంటల వరకు టోర్నమెంట్ కొనసాగుతుందన్నారు. ఆసక్తి కలిగిన ఆటగాళ్లు ఈ నెల 19 తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు. వివరాలకు ఫోన్: 98663 31280లో సంప్రదించవచ్చన్నారు.

శాలివాహన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా రఘునందన్‌రెడ్డి



మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ శాలివాహన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా చెల్లూర రఘునందన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ నడకలో భాగస్వాములుగా చేస్తామన్నారు. నడక వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలకు వివరిస్తామన్నారు. క్లబ్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు చేపడతామని ఆయన వెల్లడించారు. తనకు బాధ్యతలు అప్పగించిన వాకర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వ్యక్తి కిడ్నాప్‌కు విఫలయత్నం

- ఆర్థిక లావాదేవీలే కారణం
- ఆందోల్ సమీపంలో కిడ్నాపర్ల అరెస్టు

చైతన్యపురి: డబ్బు లావాదేవీల కారణంగా ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన ముఠాను సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శ్రీనివాసులు సమాచారం మేరకు... తపోవన్‌కాలనీలోని వైఎస్ఆర్ గార్డెన్ పార్కింగ్ స్థలంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తిని కొందరు కారులో బలవంతంగా ఎక్కించుకుని వెళుతుండగా ఆ వ్యక్తి రక్షించండి అంటూ కేకలు వేశాడు. ఇది గమనించిన గార్డెన్ పార్కింగ్ యార్డ్ సూపర్‌వైజర్ ఆనంద్ కారు వెంట కొంతదూరం పరిగెత్తాడు. అయినా ప్రయోజనం లేక పోవటంతో సరూర్‌నగర్ పోలీసులకు ఆనంద్ సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సంగారెడ్డి వైపు కారు వెళ్లినట్టు గుర్తించి ఎస్ఐ తమ సిబ్బందితో వెంబడించాడు. ఆందోల్ సమీపంలోని సంగుపేట వద్ద కారును అడ్డగించారు. కిడ్నాప్‌కు గురైన తరాల వెంకటేష్(37)ను కాపాడారు. ఉప్పుగూడకు చెందిన కారు డ్రైవర్ అయిన వెంకటేష్‌కు సంగారెడ్డి జిల్లా మూనూరు మండల్‌కు చెందిన బేగరి నవీన్ కుమార్(29)ల మధ్య డబ్బు లావాదేవీల్లో వివాదం ఉందని ఈ క్రమంలోనే కిడ్నాప్‌కు పాల్పడినట్లు గుర్తించారు. కిడ్నాప్‌లో నవీన్‌కుమార్‌కు సహకరించిన మేగావత్ ప్రవీణ్‌కుమార్(31), నేనావత్ అజయ్‌నాయక్(19), కర్రా సంజీవ్(36), కర్రా విజయ్(32)లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు. నిందితులపై కేసు నమోదు శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చైతన్యపురి: నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సీతారాం సమాచారం మేరకు... పోచమ్మబాగ్ కాలనీలో చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు శనివారం సోదాలు చేశారు. జోరీగల శ్రీనివాస్ అనే వ్యక్తి జమాల్‌పూర్ శ్రీనుతో కలిసి చైనా మాంజా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడితోపాటు ఆల్ అవుట్ బిగ్ చైనా మాంజా చరాక్‌లు అయిదు, మోనో కట్టర్ థౌంజండ్ చైనా మాంజా చరాక్‌లు 35, డ్రాగన్ థౌంజండ్ చైనా మాంజా చరాక్‌లు 11, డ్రాగన్ 500 చైనా మాంజా చరాక్‌లు ఆరు, పది లూజ్ చైనా మాంజా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఇన్‌స్పెక్టర్ సీతారాం వివరించారు.

ఎల్‌బీనగర్ పరిధిలో ఐదుగురు...

నాగోలు: నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్న ఐదుగురిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి పెద్ద ఎత్తున చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... ఎల్‌బీనగర్ మసీదు గల్లీలో మహమ్మద్ జబ్బార్, కానుగల ప్రశాంత్, మహేశ్వరం మనీష్‌కుమార్, అక్కెనపల్లి మహేష్, మహమ్మద్ నిజాం, మహమ్మద్ ఫిరోజ్‌లు తమ దుకాణాల వద్ద పతంగులతో పాటు నిషేధిత చైనా మాంజాను అమ్ముతున్నారు. రాచకొండ సీపీ దేశాల మేరకు శనివారం రాత్రి ఎల్‌బీనగర్ పోలీసులు దాడి చేశారు. చైనా మాంజాను విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా భోగి.. సంక్రాంతికి సర్వం సిద్ధం

- పలు కాలనీలలో భోగి మంటలతో సందడి
- సంక్రాంతి, కనుమ సంబురాలకు ఏర్పాట్లు పూర్తి

మన్సూరాబాద్: సంక్రాంతి సంబరాలు ఎల్‌బీనగర్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున నియోజకవర్గంలోని పలు కాలనీలవాసులు భోగిమంటలు వేసి ఉత్సవాలను జరుపుకొన్నారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ కమలాసుధీర్‌రెడ్డిలు చింతలకుంటలో జరిగిన భోగి సంబరాలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటి ఎదుట వేసిన పలు ఆకర్షణీయమైన ముగ్గులను ఎమ్మెల్యే పరిశీలించారు.

లోటస్‌ల్యాప్ పాఠశాలలో...

చైతన్యపురి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్‌ల్యాప్ పాఠశాలలో చిన్నారులకు భోగిపండ్లు పోశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు రంగురంగుల రంగవల్లులు నేత్రపర్వంగా తీర్చిదిద్దారు. విద్యార్థులు గాలిపటాలు ఎగరవేసి సందడి చేశారు. సంక్రాంతి పండగ, సంస్కృతి గురించి పాఠశాల చైర్మన్ లయన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మన్సూరాబాద్ చింతలకుంటలో భోగి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కమలాసుధీర్‌రెడ్డి



ఎల్‌బీనగర్ అభితేజ సంతోష్‌నివాస్ అపార్ట్‌మెంట్ వద్ద...



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద...



లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న దృశ్యం

చాకలి ఐలమ్మ చిత్రపటాన్ని దహనం చేసినవారిని శిక్షించాలి



రజకులకు సంఘీభావం తెలుపుతున్న బ్రహ్మయ్య

మన్సూరాబాద్: హయత్‌నగర్‌లోని ధోబీఘాట్ వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటాన్ని దహనం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని రజక సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. ధోబీఘాట్ వద్ద రజక సంఘం నాయకులు చేపట్టిన నిరసన దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ... హయత్‌నగర్ సర్వే నంబర్ 207లో ధోబీఘాట్ వద్ద కొన్నేళ్లుగా రజకులు దుస్తులు ఉతుకుతూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. గుర్తుతెలియని దుండగులు ధోబీఘాట్ వద్ద ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటాన్ని దహనం చేశారని మండిపడ్డారు. ధోబీఘాట్‌కు పట్టా జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగడాల వెంకటేష్, యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్, రాములు, శ్రీనివాస్, బాలయ్య, సామయ్య, దాసు, లక్ష్మీదాసు, చిన్న బాలమ్మ, లక్ష్మి, శశిరేఖ, అనిత తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన బాక్స్ డ్రైన్ పనులు



సాయినగర్, ధర్మపురి కాలనీ రోడ్డులో జరుగుతున్న బాక్స్‌డ్రైన్ పనులు

లింగోజిగూడ: నత్తనడకన జరుగుతున్న బాక్స్ డ్రైన్ పనులతో కాలనీవాసులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డివిజన్ పరిధిలోని సాయినగర్, ధర్మపురి కాలనీ రోడ్డులో బాక్స్ డ్రైన్ పనులు ప్రారంభమై నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు పూర్తికాక పోవడంపై కాలనీల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్న ఫలితం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బాక్స్ డ్రైన్ పనుల కారణంగా ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందని, కొంచెం ఆదమర్చిస్తే ప్రమాదాల బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దండోరా మహాధర్నా కరపత్రం ఆవిష్కరణ

మన్సూరాబాద్: ఇందిరాపార్కు వద్ద ఫిబ్రవరి 14న జరిగే దండోరా మహాధర్నా కరపత్రాన్ని ఎంఆర్‌పీఎస్ టీఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు ద్యావని నర్సింహా ఆధ్వర్యంలో శనివారం ఎల్‌బీనగర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహా మాట్లాడుతూ... దళితబంధు పథకంలో నిరుపేద దళితులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌ల పిలుపుమేరకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆకారపు రుక్కమ్మ మాదిగ, జీడీ నర్సింహ మాదిగ, ఈరసాని సుగుణమ్మ మాదిగ, సంగపాయ ఏసోఫ్ మాదిగ, మంద జయన్న మాదిగ, వేముల సూర్య ప్రకాష్, రామస్వామి, జలంధర్, లక్ష్మయ్య, శశి, నాగరాజు, వీరమల్ల వెంకన్న, మల్లేష్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

కేలండర్ల పంపిణీ

చాదర్‌ఘాట్: నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ ఆకాంక్షించారు. శనివారం ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన స్థానికులకు నూతన సంవత్సర కేలండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ గ్రేటర్ కార్యదర్శి రాజారావు, నేతలు రాజు, లక్ష్మణ్, యాదగిరి, సాయిలుగౌడ్, దుర్గప్ప, రాజేష్ పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లను పెంచాలి



హస్తినాపురంలో సంతకాలను సేకరిస్తున్న యాదగిరి

హస్తినాపురం: విద్య, ఉద్యోగావకాశాలతో పాటు చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లను పెంచి వాటిని పటిష్టంగా అమలు చేయాలని బీఎస్‌పీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ జక్కా యాదగిరి డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్‌లు పెంచాలని కోరుతూ ఎల్‌బీనగర్ శాఖ ఆధ్వర్యంలో హస్తినాపురం డివిజన్ పద్మావతి కాలనీ, షిరిడీ సాయినగర్, సంతోషిమాతా కాలనీ, డీఆర్‌డీఏ కాలనీ తదితర ప్రాంతాలలో ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీల కులగణన చేపట్టాలని, కులగణన ఆధారంగా బీసీ రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలను సేకరించి వాటిని ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. అయినా ఆదిశగా చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు సంపత్, కట్టకుమార్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

హస్తినాపురం: సంక్రాంతి సందర్భంగా హస్తినాపురంలోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో పతంగులు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ముగ్గులు అందంగా వేసి అలరించారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎస్‌కు వినతి

హస్తినాపురం: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం ధరల పెంపుతో పాటు నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేట్ విద్యానియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ... ఇప్పటికీ 2016లో నిర్ణయించిన ధరలే కొనసాగుతున్నాయన్నారు. దీంతో నిర్వాహకులకు డబ్బులు సరిపోకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ నివేదికను పరిగణలోకి తీసుకుని ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా ధరలు పెంచాలని కోరారు.



సీఎస్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న శ్రీనివాసులు

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ. 13, వంకాయ 28, బెండ 55, పచ్చిమిర్చి 45, కాకర 38, బీర 45, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 10, క్యారెట్ 15, దొండ 45, ఆలు 23, ఉల్లి 24, గోకర 35, దోస 28, సార 13, పొట్ల 13, అరటి 9, చిక్కుడు 60, ఆర్వి 60, మునగ 85, చిలగడదుంప 28, బీట్‌రూట్ 17, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యాప్సికమ్ 50.



నాగోలు శ్రీరామాలయంలో...



పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు...

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీ గోదా రంగనాథ స్వాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బుద్దోలు అశోక్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రభాకర్, వైస్ చైర్మన్‌లు కంచి కృష్ణమోహన్, మిట్టా రామ్మోహన్, సంయుక్త కార్యదర్శి ఎల్.బాలేశ్వర్, జాయింట్ సెక్రటరీ సురేష్, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొలిశెట్టి సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహపురి కాలనీలో...

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీలోని శ్రీపద్మావతీ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాల సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీగోదా రంగనాథ స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని కనులపండుగా నిర్వహించారు. బొబ్బాల లక్ష్మీనారాయణచే గోదా కల్యాణ సంబరాన్ని హరికథ రూపంలో వివరించారు. కార్యక్రమంలో పాడిచేటి విజయలక్ష్మి, ఆలయ చైర్మన్ వారణాసి వంశీ, కార్యదర్శి ప్రసన్న కృష్ణ అనంతుల సురేందర్‌రెడ్డి, హేమసుందర్‌రావు, రవి పాల్గొన్నారు.

నాగోలులో శ్రీరామాలయంలో..

నాగోలులోని శ్రీరామాలయంలో శనివారం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదా రంగానాథ స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఎన్టీఆర్‌నగర్‌లో...

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని అయాజనేయ స్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు సి.ఉపేందర్‌రెడ్డి, కిరణ్ కుమార్, వెంకటేష్ గౌడ్, ప్రేమ్ నాయక్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, జహంగీర్, నగేష్, కానుగుల వరుణ్ పాల్గొన్నారు.

ఆండాళ్ నిలయంలో...

మలక్‌పేట: మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో తిరుప్పావై ప్రవచనోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం భోగి పండగ, గోదాకల్యాణాన్ని వైభవంగా చేశారు. ఉభయ వేదాంతులు శ్రీమాన్ కందాడై లక్ష్మణమూర్తి స్వామి వారు ప్రవచనం అందించారు. ఆలయ నిర్వాహకులు ఎ.లక్ష్మీదేవి, రూపాదేవి, రామకృష్ణ పాల్గొన్నారు.

పల్టాన్‌లోని శ్రీహరిహర క్షేత్రంలో..

దయానంద్‌నగర్ పల్టాన్ శ్రీహరిహర క్షేత్రం, మైసమ్మ దేవస్థానంలో భోగి పండగ, గోదారంగనాథ స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. మంగళగిరి శ్రీనివాసాచార్యులు స్వామి ఆధ్వర్యంలో పురోహితులు స్వామి వారి కల్యాణం జరిపించారు. ఫౌండర్ ట్రస్టీ, చైర్మన్ సూగూరు రమేష్, ఈవో మార్తండరావు, ధర్మకర్తలు ప్రత్యేక పూజలు చేశారు.

మలక్‌పేట మున్సిపల్ కాలనీలో...

చాదర్‌ఘాట్: మలక్‌పేట మున్సిపల్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. స్వామివారికి వైష్ణవ సంప్రదాయం ప్రకారం కల్యాణాన్ని నిర్వహించామని ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ ఉమారెడ్డి తెలిపారు. పూజల్లో పోచమ్మ ఆలయ ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, నేతలు చంద్రశేఖర్‌శాస్త్రి, వెంకటరమణారెడ్డి, విజయ్‌శేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, రమణా కాంతాచార్యులు, సింగరాయకొండ శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌నగర్‌లో...



ఆండాళ్ నిలయంలో...



పల్టాన్ శ్రీహరిహరక్షేత్రంలో...



పూజల్లో పోచమ్మ ఆలయ ప్రతినిధి రాజశేఖర్...

పల్లెకు పట్నం.. చార్జీలు ఇష్టారాజ్యం

- పల్లె బాట పట్టిన నగరవాసులు
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు
- ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు
- యథేచ్ఛగా ప్రైవేటు ఆపరేటర్ల దోపిడీ

మన్సూరాబాద్: సంక్రాంతి సెలవులు రావటంతో నగరవాసులు తమ సొంతూరి బాట పట్టారు. పల్లె బాట పట్టిన పట్నం వాసులతో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు కిక్కిరిసి పోయింది. సంక్రాంతి పండగ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు కిటకిటలాడుతోంది.ఔ

- ▲ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీ అదనపు బస్సులను నడుపుతోంది. అయినా బస్సులు సరిపోకపోవడంతో ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో ప్రయాణికులకు రోడ్లపైనే బస్సుల కోసం పడిగాపులు పడవలసి వస్తున్నది.
- ▲ ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో ప్రయాణికులకు సమాచారం అందించేందుకు తెలంగాణ ఆర్టీసీతో పాటు ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ కూడా ప్రత్యేక సేవలను అందిస్తోంది. చివరి ప్రయాణికుడి వరకు అతని గమ్యస్థానానికి చేరవేసేందుకు ఏర్పాట్లు చేశారు.
- ▲ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇరు రాష్ట్రాల ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ సేవలు అందిస్తున్నారు.
- ▲ ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు ప్రాంతంలో ప్రత్యేకంగా టెంట్లు వేసి ప్రయాణికులు కూర్చునేందుకు కూర్చీలు వేశారు. తాగునీటి వసతి, బయో టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఇబ్బందులు కల్గకండా ప్రత్యేకంగా ఒక ఉన్నతాధికారిని నియమించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో ప్రైవేటును ఆశ్రయిస్తున్న ప్రయాణికులు



ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న ప్రయాణికులు

ప్రైవేటు ఆపరేటర్ల దోపిడీ...

- ▲ పల్లెబాట పట్టిన పట్నవాసులు నగర శివారు ప్రాంతమైన ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డుకు భారీగా చేరుకుంటున్నారు. ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నా... ప్రైవేటు దోపిడీని అరికట్టలేకపోతున్నారు. ప్రయాణికుల నుంచి సాధారణ చార్జీ కన్నా నాలుగు, ఐదు రెట్ల ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు.
- ▲ ప్రైవేటు ఆపరేటర్లు కొంతమంది దళారులను ఏర్పాటు చేసుకుని ప్రయాణికుల నుంచి ఎక్కువ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. రవాణా, పోలీస్ శాఖ అధికారులు చూసీచూడనట్లు వదలేస్తుండటంతో ప్రైవేటు ఆపరేటర్ల దోపిడీ దందా యథేచ్ఛగా సాగుతోంది.

రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు



ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. గడచిన మూడు రోజులుగా ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు నుంచి 150పైగా ప్రత్యేక బస్సులను నడిపాం. చివరి ప్రయాణికుడిని కూడా గమ్యస్థానానికి చేరవేసేందుకు ప్రయత్నిస్తున్నాం. నల్లగొండ, ఖమ్మం, విజయవాడ మూడు జోన్లను ఏర్పాటు చేసి అదనపు సిబ్బందిని నియమించి ఏర్పాట్లను పరిశీలిస్తున్నాం. ప్రయాణికులు ఏ రూట్‌వైపు ఎక్కువగా ఉంటే వెంటనే ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేస్తున్నాం. నగరంలోని కార్పొరేట్ కళాశాలల నుంచి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసి విద్యార్థులను తరలించాం. కాలనీలవాసులు, బంధువు మిత్రులు కలిసి బస్సు కావాలంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం.

– జగన్, తెలంగాణ ఆర్టీసీ డీఎం, ప్రత్యేక అధికారి